ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

గురువారం 2 మే 2024

ఘనంగా మే డే వేడుకలు 8లో..

హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం 8లో..

- కోరుట్లలో సీఎం రేవంత్ రెడ్డి సభ సక్సెస్
- భారీగా తరలివచ్చిన జనం
- కార్యకర్తల్లో నూతనోత్తేజం నింపిన రేవంత్ రెడ్డి

కోరుట్ల, మే 1: లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన జాతర సభ కోసం కోరుట్లకు రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నింపింది. హైద్రాబాద్ నుంచి హెలిక్యాప్టర్‌లో కోరుట్లకు చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి సుమారు రెండు గంటల పాటు పట్టణంలో పర్యటన కొనసాగింది. కోరుట్ల నియోజకవర్గంతో పాటు సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని మేడిపల్లి, కథలాపూర్, బీమారం మండలాలు, జగిత్యాల నియోజకవర్గం పరిధిలోని పలు మండ లాలకు చెందిన ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి సభకు తరలివచ్చారు. సభ విజయవంతం కావడం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది.



హాజరైన జనం, మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

కాంగ్రెస్‌లో జోష్



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి

సీఎం హోదాలో తొలిసారిగా జిల్లాకు..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా రేవంత్ రెడ్డి జిల్లాలో పర్యటించారు. గత యేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను కైవసం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సీఎంగా రేవంత్ బాధ్యతలు తీసుకున్న తరువాత ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జనజాతర సభలో పాల్గొనడానికి కోరుట్లలో పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై ప్రశంసల జల్లు..

నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. పదవికే వన్నె తెచ్చేలా జీవన్ రెడ్డి రాజకీయం ఉంటుందని కొనియాడారు. రైతు బిడ్డగా జీవన్‌రెడ్డి చేస్తున్న సేవలను వివరించారు. నిజామాబాద్ జిల్లా బోధన్, జగిత్యాల జిల్లా ముత్యంపేటలలో గల షుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ కోసం జీవన్‌రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి పలు పర్యాయాలు హైద్రాబాద్‌కు వచ్చి తనను కలిశారని, ఫలితంగా కాంగ్రెస్ సర్కారు గల్ఫ్ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించిందని వివరించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో జీవన్ రెడ్డిని గెలిపించుకొని కేంద్రంలో ఏర్పడేబోయే ఇండియా సర్కారులో వ్యవసాయ శాఖ మంత్రిగా చూడాలని ఓటర్లకు పిలుపునిచ్చారు.

- కోరుట్ల సభకు సీఎం రేవంత్ రెడ్డి రావడంతో అప్పటికే అక్కడ వేచి ఉన్న సభికులు ఒక్కసారిగా కేరింతలు, ఈలలు, చప్పట్లతో స్వాగతం పలికారు.
- సీఎం ప్రసంగిస్తున్న సమయంలో మధ్యమధ్యలో పలు మార్లు సభికులు చప్పట్లతో హోరెత్తించారు.
- సభకు హాజరైన జనానికి అవసరమైన తాగునీటిని, మజ్జిగ ప్యాకెట్లను నిర్వాహకులు పంపిణీ చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి సభ సైడ్ లైట్స్

- సీఎం రేవంత్ రెడ్డి సభకు వచ్చే వరకు పలువురు గాయకులు పాటలు పాడి సభికులను ఉత్తేజపరిచారు.
- సీఎం సభా స్థలానికి చేరుకునే వరకు ఎండ వేడి తట్టుకోడానికి సభకు వచ్చిన జనం చెట్ల నీడలను ఆశ్రయించారు.
- ఎండవేడిలో జాతీయ రహదారి పై డ్యూటీ చేస్తున్న పోలీసులు ఆ ప్రాంతంలో చెట్టు నీడలను ఆశ్రయిస్తూ ట్రాఫిక్ క్లియర్ చేయడం విశేషం.

\- కోరుట్ల రూరల్

దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

కోరుట్ల: దేశంలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం కోరుట్ల శివారులో కాంగ్రెస్ నిర్వహించిన జన జాతర ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్ని కల్లో 400 సీట్లు సాధించుకొని రాజ్యాంగాన్ని మార్పు చేసి, రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ యోచిస్తోందన్నారు. మేధావులు, విద్యావంతులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఇటీవల రిజర్వేషన్లు లేని భారత దేశాన్ని చూడాలన్నారని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ కుల గణన సర్వే ప్రస్తావనను ముందుకు తీసుకువస్తే..కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని విమర్శించారు. యథావిధిగా రిజర్వేషన్లు ఉండాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే తెలంగాణలో కుల గణన సర్వే చేస్తుందని తెలిపారు.

సీనియర్ నేత జీవన్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అసెంబ్లీ ఎన్నిక ల సమయంలో కాంగ్రెస్ ఇచ్చి ఆరు గ్యారెంటీలతో పాటు ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి కృషి ఫలితంగా ఇటీవల అదనంగా ఎన్ఆర్ఐ గ్యారెంటీని సీఎం ప్రకటిం చారన్నారు. నిజాం దక్కన్ షుగర్ లిమిటెడ్ కార్మాగారాలను తెరిపించడానికి జీవన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. ఫలితంగా ఎన్ డీఎస్ఎల్ పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రయత్నం ముందుకు వచ్చిందన్నారు. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు.

కాంగ్రెస్‌కు అధిక మెజార్టీ ఇవ్వాలి: సినీ నటి దివ్య వాణి

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధిక మెజార్టీ ఇవ్వాలని సినీ నటి దివ్య వాణి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు సీఎం విశేష కృషి చేస్తున్నారన్నారు. భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకవచ్చిన కాంగ్రెస్‌ను పార్ల మెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు.



గాడిద గుడ్లును ప్రదర్శిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, జీవన్ రెడ్డి

ప్రశ్నించే గొంతులను మోదీ ప్రభుత్వం జైలులో పెడుతోంది..

సీపీఐ సీనియర్ నాయకులు చాడా వెంకట్ రెడ్డి

దేశంలో ప్రశ్నించే గొంతులను మోదీ ప్రభుత్వం జైలులో పెడుతోందని సీపీఐ సీనియర్ నాయకులు అన్నారు. ఇటీవల దేశంలోని పలువురు నేతలను, ప్రజాప్రతినిధులను మోదీ సర్కారు జైలులో పెట్టిందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి బీజేపీ నియంతృత్వానికి స్వస్తీ పలకాలన్నారు.

కోరుట్లలో సీఎం పర్యటన జరిగిందిలా...

- మధ్యాహ్నం 1.05 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కోరుట్లకు చేరుకున్నారు.
- 1.10 నిమిషాలకు కోరుట్ల శివారులోని హెలిప్యాడ్ వద్ద దిగారు.
- 1.15 నిమిషాలకు రోడ్డు మార్గంలో సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- 2.00 నిమిషాలకు సీఎం ప్రసంగం ప్రారంభించారు.
- 2.32 నిమిషాల వరకు సీఎం ప్రసంగం కొనసాగింది.
- 2.40 గంటలకు ప్రజలకు వీడ్కోలు చెబుతూ హెలిప్యాడ్ వద్దకు వెనుదిరిగారు.
- 2.45 నిమిషాలకు హెలిక్యాప్టర్ ద్వారా సీఎం హైద్రాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

జీవితం చివరి అంకం వరకు ప్రజా సేవలోనే..

నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి

జీవితం చివరి అంకం వరకు ప్రజా సేవలోనే ఉంటానని నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలువడం, ఓడడమే కాకుండా ప్రజా జీవితంలో అను నిత్యం ఉండడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనను ఆదరించాలని కోరారు. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. చక్కర కర్మాగారం తెరిపిస్తానన్న హామీని నెరవేర్చలేక పోయాడన్నారు. కాంగ్రెస్ అధిష్టానం తనను ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి పోటీ చేయాలని సూచించినా తనకు రాజకీయ జీవితాన్ని ప్రసా దించిన జగిత్యాల నియోజకవర్గం పరిధిలో గల నిజామాబాద్ పార్లమెం ట్ స్థానం నుంచే పోటీలో దిగానన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ప్రాంతంలో మామిడి పరిశోధన కేంద్రం, ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాల్సిన అసరముందన్నారు. మామిడి ఎక్స్‌పోర్టు కోసం అవకాశాలు పెంచడానికి కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీలు మహేశ్ కుమార్ గౌడ్, ఆకుల లలిత, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, జువ్వాడి నర్సింగ్‌రావు, జువ్వాడి కృష్ణారావు, కొమిరెడ్డి కరం, కల్వకుంట్ల సుజిత్ రావు, జెఎన్ వెంకట్, ఆకుల లింగారెడ్డి, ఎండీ షాకీర్ సిద్ధిఖీ, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ, సునిల్, వినయ్‌రెడ్డి, జితేందర్‌రావు, బండ శంకర్, కొమిరెడ్డి లింగారెడ్డి పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

జడ్పీ సీఈవో రఘువరన్



సుద్దపల్లిలో కూలీలు, కార్యదర్శితో మాట్లాడుతున్న సీఈవో

పెగడపల్లి, మే 1 : గ్రామాలలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని జిల్లా పరిషత్ సీఈవో రఘువరన్ పేర్కొన్నారు. బుదవారం పెగడపల్లి మండలంలోని సుద్దపల్లిలో ఉపాదిహామీ పనులను జడ్పీ సీఈవో రఘువరన్ సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్ని జాబ్ కార్డులు ఉన్నాయి, ఎంత మంది పనులకు హాజరవుతున్నారు, పని ప్రదేశంలో వసతులు తదితర అంశాల గూర్చి కూలీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాదిహామీ టీఏలు, క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులతో సమావేశం నిర్వహించి వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో ఆయా గ్రామపంచాయతీలే తాగు నీటి వసతి కల్పించాలని, మెడికల్ కిట్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు, షెడ్ నెట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. పని తగిన అందించాలని, ప్రతి ఒక్కరు పనికి వచ్చే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీవో అనీల్ కుమార్ పాల్గొన్నారు.

ఆర్య వైశ్యుల సంక్షేమానికి పెద్దపీట

కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, మే 1 : ఆర్య వైశ్యుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. నిజామాబాద్ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే తమ మద్దతూ అంటూ సభ్యులు తీర్మానం చేశారు. ఈ సమ్మేళానికి జీవన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ 40 ఏళ్లుగా జగిత్యాల పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నాని ఎంపీ ఎన్నికల్లో ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, శ్రీనివాస్, పురుషోత్తం ఉన్నారు.

పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా లోక్ సభ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. బుధవారం హైద్రాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, ఇతర అధికారులతో ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా హాజరయ్యారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, హోం ఓటింగ్, ఓటర్ స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై సూచన లు, సలహాలు, ఆదేశాలు ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర, ఆర్‌డీఓలు మధుసుదన్, ఆనంద్ మోహన్, డిప్యూటీ సీఈవో రఘువరన్, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, తహసీల్దార్ కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

ఉచిత వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరం

గొల్లపల్లి, మే 1: గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని బాల, బాలికలకు ఉచిత వేసవి బాల్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు గొల్లపల్లి వాలీబాల్ అసోసియేషన్ సభ్యులు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు ఉచిత వేసి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల బాల, బాలికలు పాఠశాలకు వచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఉంటాయన్నారు. వివరాలకు మండల జగన్ 96767 35033, గురజాల బుచ్చిరెడ్డి 95531 06677, ఎం.ఉమేష్ 9491367584, చీపెల్లి చందు 9121981566లలో సంప్రదించాలని అన్నారు. బాల, బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కొడిమ్యాల, మే 1 : కరీంనగర్ ఎంపీగా బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకులు బుధవారం మండలంలోని అప్పారా వుపేటలో ఉపాధి కూలీల వద్ద, తురుకకాశీనగర్ గ్రామాల్లో ప్రచారం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటు వేసి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్య క్రమంలో అప్పారావుపేట గ్రామ మాజీ సర్పంచు మల్లేశంముది రాజు, బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, మల్లేశం, మహేష్, రవి, నాయకుడు చాంద్‌పాషా, ఉన్నారు.

బీజేపీ నాయకుల ప్రచారం

మల్యాల, మే 1: కరీంనగర్ లోక్‌సభ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కు మద్దతుగా మల్యాల మండల కేంద్రంలో బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సంజయ్‌కు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మోదీ అమలు చేసిన పలు సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించి మూడో సారి మోదీని ప్రధాని చేయాలని కోరారు. పట్టణ శాఖ అధ్యక్షుడు జనగాం రాములు, పొరండ్ల మహేష్, ముకుంద గంగాధర్ తదితరులు ప్రచారం నిర్వహించిన వారిలో ఉన్నారు.

హామీలు అమలు చేయలేక కేంద్రంపై విమర్శలు

ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్



ప్రసంగిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 1: ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చలేక సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రం విమర్శలుచేస్తున్నారని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ గెలిస్తే సీఎం సీటు పోతుందనే భయం పట్టుకుందన్నారు. సీఎం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను బద్నాం చేస్తే చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమన్నారు. రిజర్వేషన్ల రద్దు నాటకం కాంగ్రెస్ కుట్రలో భాగమేనన్నారు. 2004 నుంచి 2014 వరకు కేద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ రిపోర్టును ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలపై జనం నిలదీస్తుంటే చర్చను పక్కదారి పట్టించేందుకే రిజర్వేషన్ల రద్దు అంటూ డ్రామాలాడుతున్నారన్నారు. ఎన్ని డ్రామాలాడినా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఈ ఎన్నికల్లో గెలవలేవన్నారు. కరీంనగర్‌లో దేవుడిని కొలిచే ప్రతి ఒక్కరూ ఈ నెల 13న ఎన్నికల్లో బీజేపీకి ఓటేయాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి నాన్ లోకల్ అని, పదేళ్ల అధికారంలో ఉన్నా ప్రజలకు చేసిందేమి లేదన్నారు. ఇక్కడున్న మంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కరీంనగర్ అభివృద్ధి కోసం 12 వేల కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చానన్నారు. ప్రజల పక్షాన పోరాటం చేసి పాదయాత్ర చేశానన్నారు. స్మార్ట్‌సిటీ కోసం నిధులు, ఆర్వోబీ కోసం 154 కోట్ల నిధులు తీసుకు వచ్చానన్నారు. ఆరు గ్యారెంటీలకు మోసపోయి ప్రజలు మీకు ఓట్లేస్తే అమలు చేయకుండా మోదీ గాడిద గుడ్డు కూడా ఇవ్వలేదని హేళన చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలు ఇస్తామన్న మీరు గాడిద గుడ్డు ఇచ్చారా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ బీజేపీని ప్రజలు నమ్మవద్దు

బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కొడిమ్యాల, మే 1 : కాంగ్రెస్, బీజేపీలను నమ్మవద్దని బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని అంగడి బజారులో ఎన్నికల ప్రచారంలో భాగంగా చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌తో కలిసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాంగ్రెస్ వాళ్ల చెప్పిన ఆరు గ్యారంటీలను నమ్మి ప్రజలు ఇప్పటికే మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు ఊడుతుందో తెలియదన్నారు. కొండగట్టు అభివృద్ధి బండి సంజయ్ ఏమి తీసుకరాలేదన్నారు. బీజేపీ మాటలు నమ్మి మోసపోతే ఇక్కడ రేవంత్‌రెడ్డి, డిల్లీలో నరేంద్రమోడీ హైదరాబాదును కేంద్ర పాలిత ప్రాంతం చేసెందుకు కుట్రలు చేస్తారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను పార్లమెంట్‌కు పంపాలని కోరారు. నరేంద్ర మోడీ పాలనలో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. కొండగట్టు దేవస్థానం అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 334 ఎకరాల అటవీ భూమిని ఇప్పించానన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కొడిమ్యాల జడ్పీటీసీ ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, ఏఎంసీ మాజీ చైర్మన్ నరేం దర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, స్వామి, ప్రభుదాస్, శుకూర్, అక్బర్, లింగాగౌడ్, రాజేశం, పలువురు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రదానం

గణేశ్‌నగర్, మే 1: ఎస్సారార్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం బేసిక్ బ్యూటీషియన్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ జయంతి అసోసియేట్ ప్రొఫెసర్ ప్రిన్సిపల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ శాతవాహన యూనివర్సిటీ ముఖ్య అతిథిగా విచ్చేసి సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. సౌందర్యం యొక్క ఆవశ్యకతను పరిగణలో ఉంచుకొని ఈ కోర్సులో వారు నేర్చుకున్నటువంటి అంశాలను సద్వినియోగపరచుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ కోర్సును ఉద్దేశించి గత 10 సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతున్నటువంటి ఈ కోర్సు ఎంతో మందికి ఉపాధిని కల్పించిందని మీరు కూడా అదే దిశగా నడక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగ అధిపతి శ్రీమతి ఉమా మహేశ్వరి మాట్లాడుతూ ఇంతటి గొప్ప విలువైన విద్యను నేర్పిన కళాశాలను విద్యార్థులను కోఆర్డినేటర్, రిసోర్స్‌పర్సన్ లీనాను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా బేసిక్ బ్యూటిషన్ కోర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మన్నే శోభారాణి మాట్లాడుతూ బేసిక్ బ్యూటీషియన్ కోర్సుకు సంబంధించిన ప్రతి విషయం గురించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఏవో కామ రాజు, లెక్చరర్స్ సోనియారెడ్డి, డాక్టర్ ప్రమీల,జూబ్లీ రెప్లిక, కోర్సు రిసోర్స్ పర్సన్ లీనా, కోర్సుకు సంబంధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

బాలభవన్ శిక్షణ శిబిరానికి స్పందన



నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్ కల్చరల్, మే 1: జిల్లా కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రతి యేటా 5 నుంచి 16 సంవత్సరాల బాలబాలికలకు వేసవిలో నిర్వహించే శిక్షణా శిబిరం అంబేద్కర్ స్టేడియంలో జరుగుతోంది. శిబిరానికి చిన్నారుల నుంచి మంచి స్పందన వస్తోంది. చిత్రలేఖనం, పెన్సిల్ పేయింటింగ్స్, హాండ్ రైటింగ్, గాత్ర, కర్ణాటక సంగీతం, లలిత, దేశభక్తి గేయాలు, మృదం గం, తబల, కంజీర, జానపద, క్లాసికల్, సెమీ క్లాసికల్, వెస్టన్ నృత్యాలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్, మెహం దీ కోర్సులతో పాటు అబాకస్, చెస్, శాస్త్రీయ నృత్యం, యోగాల్లోనూ శిక్షణ ఇస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లలను శిక్షణకు పంపిస్తున్నారు. జూన్ 8వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. పాత, కొత్త విద్యార్థులు కలిపి ప్రస్తుతం (ఏప్రిల్ 30వ తేదీ వరకు) 330 మంది వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. బాలబాలికలు ఆధార్ కార్డ్, ఫొటోతో సంప్రదించాలని కోరారు. ఈ మాసంలో విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నా రు. శిక్షణకు సహకరిస్తున్న జిల్లా కలెక్టర్, డీఈఓ, విద్యార్థుల తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులు, తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని, వాటర్ బాటిల్స్, స్నాక్స్ తెచ్చుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు ఓవరాల్ చాంపియన్ షిప్



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన కరీంనగర్ జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, మే1: ఖమ్మం జిల్లాలోని సర్దార్ పటేల్ ఇండోర్ స్టేడియంలో ఏప్రిల్ 28,29,30 తేదీలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి టెబుల్ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. ఈ పోటీల్లో జిల్లాకు చెందిన జీఎస్ అకాడమీ క్రీడాకారులు పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచి క్యాడెట్ విభాగంలో చైత్ర కాంస్య పతకం, బాలికల విభాగంలో అవనిరెడ్డి, సత్య, సింధు, అనన్యలు రెండు బంగారు, రెండు వెండి, ఒక కాంస్య పతకాలను సాధించారు. అలాగే ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో అజయ్, అవని రెడ్డి, రజిత పతకాలను సాధించారు. బాలుర విభాగంలో అజయ్, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని, పురుషుల డబుల్స్‌లో అజయ్, చన్మయ్ రజత పతకాలను సాధించి ఈ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించి పెట్టారని జీఎస్ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ జి శరత్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సర్దార్ సురేందర్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను జీఎస్ అకాడమీ ఉపాధ్యక్షుడు బి.శ్రీదర్ గౌడ్, బి మహేష్, యస్ మహిపాల్, సంయుక్త కార్యదర్శి వికాస్ కుమార్, కోశాధికారి గౌతంరెడ్డి, సభ్యులు రజనీకాంత్‌రెడ్డి, శ్రీకరచారి, సంతోష్, హర్ష అభినందించారు.

కోడలిని దారుణంగా హత్య చేసిన మామ


ఆకుల మౌనిక(ఫైల్)

సారంగాపూర్, మే1: మండలంలోని రేచపల్లి గ్రామంలో కోడలిని గొంతు కోసి మామ హత్యచేసిన ఘటన బుధవారం కలకలం రేపింది. ఈ హత్యకు సంబంధించిన వివరాలను రూరల్ సీఐ అరీఫ్ అలీఖాన్ వెల్లడించారు. రేచపల్లి గ్రామానికి చెందిన ఆకుల మౌనిక (25)ను కొత్తపల్లి లచ్చనాయక్ తండాకు చెందిన ఆకుల తిరుపతితో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. తిరుపతి జీవనోపాధి నిమిత్తం న్యూజిలాండ్ వెళ్లాడు. ఈ నెల 27న ఇద్దరు వ్యక్తులు మౌనిక పట్ల అసభ్యంగా ప్రవర్తించి వేధింపులకు గురిచేశారు. దీంతో మౌనిక వేధింపులు తాళలేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మౌనిక ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదైంది. అయితే మౌనిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడంతో తమ కుటుంబ పరువు పోయిందని మామ ఆకుల రాజిరెడ్డి కోడలిని మందలించాడు. ఇదే విషయమ్మై ఆమెపై రాజిరెడ్డి కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో మౌనిక ఇంట్లో నిద్రిస్తుండగా ఆరుబయట పడుకున్న మామ రాజిరెడ్డి పథకం ప్రకారం ఉదయం 5 గంటల సమయంలో కత్తితో మౌనిక గొంతు కోసి హత్య చేశాడు. దీంతో మౌనిక అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. తండ్రి తోట రాజయ్య ఫిర్యాదు మేరకు మామ రాజిరెడ్డి, అత్త గంగవ్వ, భర్త తిరుపతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వడదెబ్బతో దివ్యాంగ బాలుడి మృతి

రామడుగు, మే 1: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కళ్లెం యశ్వంత్ (5) అనే దివ్యాంగ బాలుడు బుధవారం వడదెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కళ్లెం అంజయ్య, పుష్ప దంపతుల కుమారుడు యశ్వంత్ పుట్టినప్పటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. బాలుడి కోసం దంపతులు పెద్ద ఎత్తున ఖర్చు చేశారు. అంత్యక్రియలు నిర్వహించడానికి ఇబ్బందిగా ఉన్న కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మా ఆస్తులను అప్పగించే అధికారం లేదు

● కొండగట్టు అధికారులకు విన్నవించిన సిద్దిపేట జిల్లా వాసులు ● గతంలో 2.20 ఎకరాలు దానం చేస్తానని ప్రకటించిన భక్తుడు

మల్యాల, మే 1: మా ఆస్తులను కొండగట్టు ఆలయానికి దానం చేస్తానని ప్రకించిన తమ తండ్రి మాటలను పరిగణలోకి తీసుకోవద్దని సిద్దిపేట జిల్లాకు చెందిన కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులకు విన్నవించారు. తన కొడుకు తనను సాకడం లేదని తన ఆస్తిని కొండగట్టు అంజనేయస్వామికి దానం చేయడానికి సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అల్లీపూర్‌కు చెందిన కొప్పెర బాపురెడ్డి గత నెల 24న ఆలయానికి వచ్చాడు. ఆస్తి పత్రాలను హుండీలో వేయడానికి ప్రయత్నించాడు. గమనించిన అక్కడి సిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో అతని కుటుంబ సభ్యులు బుధవారం కొండగట్టుకు వచ్చి అధికారులను కలిసారు. ఆరోగ్య పరిస్థితి సరిగ్గా లేక తన భర్త తమ ఆస్తులను కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి దానం చేస్తానని తెలిపాడని బాపురెడ్డి భార్య లక్ష్మీ, కుటుంబ సభ్యులు దేవస్థానం అధికారులకు తెలిపారు. ఈ మేరకు అతడి భార్య లక్ష్మి, కుమారుడు ప్రవీన్‌కుమార్, కూతుళ్లు మల్లీశ్వరి, స్వరూప ఈవో చంద్రశేఖర్‌కు భూదానంపై ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆరోగ్య పరిస్థితి సరిగా లేని బాపురెడ్డి తమ కుటుంబ ఆస్తులను దానం చేస్తానని ఇటీవల కొండగట్టుకు వచ్చి ప్రచారం చేయడాన్ని పరిగణలోకి తీసుకోవద్దని కోరారు. తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆ ఆస్తులు తమకు మాత్రమే సంక్రమిస్తాయని అతడికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. దీనిపై దేవస్థానం అధికారులు తమను సంప్రదించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు. బాపురెడ్డి 2.20 ఎకరాలకు సంబంధించిన పత్రాలు తదితరవి హుండీలో వేయాలని ప్రయత్నించాడు.


కొండగట్టు ఆలయ ఈవోకు వినతిపత్రం అందజేస్తున్న కటుంబ సభ్యులు

హుండీలలో వేస్తే ప్రయోజనం లేదని అధికారులు తెలుపగా దేవాలయం పక్కన రామాలయం నిర్మిస్తే ఆ భూమిని దానం చేస్తానని బాపురెడ్డి బాండ్‌పేపర్ రాసిచ్చాడు. పానుపుస్తకం అందించగా దేవస్థానం అధికారులు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. దీంతో కుటుంబసభ్యులు బుధవారం వచ్చి బాపురెడ్డి తమతో 15ఏళ్లుగా ఉండడం లేదని భూమి దానంకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరారు.

మంథని సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్


ఫీడర్ బ్రేకర్ వద్ద మంటలు

మంథని, మే 1: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11 కేవీలో మండలంలోని కాకర్లపల్లి ఫీడర్ సిటీ బ్లాస్ట్ కావడంతో బుధవారం విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ ఫైరింగ్ కావడంతో మంథని టౌన్‌తో పాటు కాకర్లపల్లి సూరయ్యపల్లి, గంగాపురి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ విషయంలో వెంటనే స్పందించిన పెద్దపల్లి ఎస్సీ బొంకూర్ సుదర్శన్ సబ్‌స్టేషన్ సందర్శించి మంథని డీఈ ఈశ్వర ప్రసాద్, ఏఈ చిన్నాల మల్లయ్యలతో పరిస్థితిని సమీక్షించారు. ఉదయం 10 గంటలకు బ్లాస్టింగ్ వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగగా ఎస్సీ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి 11 గంటలకు సరఫరా చేశారు. ఫీడర్ బ్రేకర్ సిటీ బ్లాస్ట్ కావడంతో ఫైర్‌స్టేషన్ అధికారి సదానందం తమ సిబ్బందితో చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు.

చేపలు పట్టడంపై రెండు గ్రామాల మధ్య వివాదం

మల్యాల,మే1: మండలంలోని పోతారం చెరువులో చేపలు పట్టడంపై పోతారం, గొల్లపల్లి గ్రామ వాసుల మధ్య గత రెండు రోజులుగా వివాదం నెలకొంది. మంగళవారం పోతారం చెరువులో చేపలు పట్టగా పోతారానికి చెందిన కొందరు లాక్కెళ్లిన్నట్లు గొల్లపల్లికి చెందిన గంగపుత్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం పోతారానికి చెందిన వాల్మికి భోయ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఇరు గ్రామాల వాదనలు విన్న పోలీసులు మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. వివాదంను అధికారులు పరిష్కరించాలని ఇరు గ్రామాల మధ్య గొడవలు లేకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 1: కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట, చెర్ల బూత్కూర్ గ్రామాల్లో బుధవారం కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 603 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ డేవిడ్ రవికాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావుల ఆదేశాలు మేరకు జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కే నాగేశ్వరరావు అధ్వర్యంలో రెండు గ్రామాల్లో దాడులు నిర్వహించి ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఫకీర్‌పేటకు చెందిన అడపా వంశీ, మనకొండూరు మండలం వేగురుపల్లికి చెందిన తప్పేట నితీష్‌కుమార్‌లను అరెస్టు చేయగా కరీంనగర్ కాశ్మీర్ గడ్డకు చెందిన ఎండీ ఉమర్ అలియాస్ నోమన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పట్టుబడిన వారి వద్దనుంచి 603 గ్రాముల గంజాయి, ద్విచక్రవాహనం, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. చర్లభుత్కూర్ గ్రామంలో గంజాయి సేవిస్తూ పట్టుబడ్డ ఐదుగురు వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసేందుకు కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌లో


నిందితులను అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ నాగేశ్వరరావు

అప్పగించామని తెలిపారు. ఈ దాడులలో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్ల కుమార్ యాదవ్, ఖాసింబీ, కమలాకర్, వర్మ, జీవన్, ట్రైనీ కానిస్టేబులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అంటేనే స్కాముల పార్టీ

భగత్‌నగర్, మే 1: కాంగ్రెస్ పార్టీ అంటేనే స్కాముల పార్టీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి విమర్శించారు. బుధవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2జీ, సహారా, బొగ్గు, ఈఎస్ఐ స్కాంలతో దేశాన్ని భ్రష్టుపట్టించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్ద అవినీతిపరుడని ఆరోపించారు. ఓ ట్రావెల్స్ అధినేత నుంచి కోటిన్నర విలువైన కారు, ఎన్టీపీసీ బూడిద తీసుకెళ్లే లారీలను ఆపి కాంట్రాక్టర్‌ను బెదిరించి మొదట రెండు కోట్లు, ఆ తర్వాత 6 కోట్లు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇద్దరు కాంట్రాక్టర్‌ను బెదిరించి డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎంపీ టికెట్ ఇచ్చినందుకు వెలిచాల రాజేందర్‌రావు వద్ద కోట్లాది రూపాయలు డబ్బులు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం అవినీతి, వ్యవహార శైలి చూస్తుంటే కాంగ్రెస్ నేతలే అసహ్యించు కుంటున్నారన్నారు. నాటి మంత్రి గంగులతో లాలూచీ పడి 5 కోట్లు తీసుకుని హుస్నాబాద్‌కు పారిపోయాడన్నారు. జర్నలిస్టులకు బీపీఎల్ కోటా కింద ఇచ్చిన భూములపై కన్నేసి లేని వివాదాన్ని సృష్టించిన మాట నిజం కాదా అన్నారు. బూడిద స్కాంపై అవసరమైతే సీబీఐకి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ

లేఖ రాస్తామన్నారు. రిజర్వేషన్లపై ఫేక్ వీడియోలు సృష్టించి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్న నీచమైన పార్టీ కాంగ్రెస్‌పార్టీ అన్నారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్‌కుమార్ మాట్లాడుతూ 54 సంవత్సరాలు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ రిజర్వేషన్లకు తూట్లు పొడి చిందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక గ్రామాలకు కరెంట్ సౌకర్యం కల్పించ డంతో పాటు అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

గంగాధర, మే 1: గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కొత్తపల్లి మండలం రేకుర్తికి చెందిన తూర్పటి మైసయ్య(27), అతని బావ పత్తి ముత్యాలు ఇద్దరు గంగాధర మండలం గట్టుబూత్కూర్ చెరువులో చేపలు పట్టేందుకు బుధవారం వెళ్లారు. ఇద్దరు చెరువు కట్టపై మద్యం సేవించిన అనంతర తూర్పటి మైసయ్య చేపల కోసం చెరువులోకి దిగాడు. మద్యం మత్తులో చెరువులోకి దిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి చెల్లె గంగ ఫిర్యాధుమేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

● తప్పిన ప్రమాదం

సుల్తానాబాద్, మే 1: ఓ కుటుంబం కారులో దైవదర్శనానికి వెళ్లివస్తుండగా కారు అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. సింగరేణి అండ్రియాల ప్రాజెక్టులో పని చేస్తున్న ఓ కార్మికుడి కుటుంబం మొక్కు చెల్లించడానికి ఏప్రిల్ 27 తిరుమలకు కారులో వెళ్లారు. తిరిగి వస్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారి వద్ద ఐబీ చౌరస్తా దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి డివైడర్ పైకి దూసుకెళ్లింది. కారు ముందు టైర్ పేలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న కొందరికి స్వల్పగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని కారును పక్కకు తీయించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రాజీవ్ రహదారిపై ఘటన జరుగడంతో కారులో ఉన్న వారు భయాందోళనకు గురయ్యారు.

అక్కా చెల్లెళ్ల అదృశ్యం

మల్యాల,మే 1: మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన అక్కాచెల్లెళ్లు అదృశ్యమైనట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు. ఓబులాపూర్‌కు చెందిన బొజ్జ బాబు భార్య లక్ష్మి గత 25 రోజుల క్రితం మృతి చెందగా కూతుళ్లు వైష్ణవి(17), ప్రసన్న(15)లతో బాబు ఉంటున్నాడు. మంగళవారం రాత్రి మేడపైన ముగ్గురు పడుకోగా బాత్రూంకు వెళ్లి వస్తామని చెప్పి కిందకు దిగిన అక్కాచెల్లెళ్లు ఇంటి నుంచి వెళ్లిపోయారు. తిరిగి రాకపోవడంతో తండ్రి చుట్టుపక్కల ఇళ్లు, పలు చోట్ల వెతికాడు. ఆచూకీ లభించకపోవ డంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికల తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

తంగళ్లపల్లి, మే 1: ప్రేమ విఫలం అవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, యువకుడి బంధువుల కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండీ సజన్ (23) గత కొంతకాలంగా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి శివారులోని పెట్రోల్ బంక్ పక్కన తాత్కలిక రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకుని పంక్చర్ షాపు నిర్వహిస్తున్నాడు. గతంలో ఓ అమ్మాయి ప్రేమలో పడగా అది విఫలం అవడంతో ఆత్మహత్య ప్రయత్నం చేయగా కుటుంబ సభ్యు లు అడ్డుకుని కౌన్సిలింగ్ నిర్వహించారు. అప్పటి నుంచి మనోవేద నకు గురవడంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. దీంతోతీవ్ర మనస్థాపానికి గురై పంక్చర్ నిర్వహించే షెడ్డులో ఉరివేసుకోని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని సమీప బంధువులు పెద్దూర్ గ్రామానికి చెందిన సమీర్ పోలీసులకు మృతుని వివరాలను, ఆత్మహత్యకు గల కారణాలను వెల్లడించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

మల్యాల, మే 1: కరీంనగర్-జగిత్యాల మార్గంలోని రాజారం ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఓ లారీ ఇంట్లోకి దూసుకెళ్లింది. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వస్తున్న లారీ అదుపుతప్పి రహదారి పక్కన గల బక్కశెట్టి పెద్ద గంగారాం అనే వ్యక్తి ఇంట్లోకి దూసుకెళ్లింది. దీంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పగా ఇంటి ముందు భాగం పూర్తిగా దెబ్బతిన్నది.

పంట పొలాల్లో చెలరేగిన మంటలు


మండలను ఆర్పుతున్న రైతులు, పోలీసులు

సుల్తానాబాద్ మే 1: ధాన్యం లోడ్‌తో వస్తున్న ఓ లారీ తాకడంతో విద్యుత్ వైర్లు తెగి పంటపొలాల్లో పడ్డాయి. దీంతో మంటలు వ్యాపించి పంట పొలాలు అగ్నికి ఆహుతయ్యాయి. కదంబాపూర్ నుంచి ధాన్యం బస్తాల లోడ్‌తో రైల్వే ట్రాక్ వెంట వస్తున్న ఓ లారీకి పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దాంతో తీగలు పొలాలపై పడిపోయి మంటలు అంటుకున్నాయి. దాదాపు పది ఎకరాల్లో మంటలు అంటుకుని లక్ష రూపాయల వరకు నష్టం కలిగినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులతో కలిసి మంటలను ఆర్పడంలో సహకరించారు. పెద్దపల్లి నుంచి వచ్చిన ఫైరింజన్ మొరాయించడంతో సిబ్బంది కూడా పోలీసులు, రైతులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య


రంగు తిరుపతి (ఫైల్)

ఇల్లందకుంట, మే 1: మండల కేంద్రానికి చెందిన రంగు తిరుపతి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఇల్లందకుంట గ్రామానికి చెందిన రంగు తిరుపతి, కవిత దంపతులకు ఇరువురు సంతానం ఉన్నారు. ఇరువురి మధ్య తరుచూ గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో మానసికంగా కుంగిపోయిన తిరుపతి మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కూతురు రంగు కీర్తన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ పేర్కొన్నారు.

బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ పరీక్ష రుసుం గడువు 7 వరకు

గణేశ్‌నగర్,మే1: ఎస్‌యూ పరిధిలోని బీఎస్సీ ఆనర్స్ రెండో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్ష రుసుం చెల్లించడానికి ఎలాంటి అపరాధ రుసుం లేకుండా 7వ తేదీ వరకు తుది గడువు అని, 300/- ల అపరాధ రుసుంతో 10వ తేదీ వరకు చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్ వి శ్రీ రంగప్రసాద్ తెలిపారు. ఈ పరీక్షలను జూన్‌లో నిర్వహించనున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మెట్‌పల్లి, మే 1: పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూక్య భూమయ్య(55) అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామానికి చెందిన భూక్య భూమయ్య పనుల నిమిత్తం మెట్‌పల్లికి వచ్చాడు. పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భూమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. మెరుగైన చికిత్స కోసం వైద్యుల సూచనల మేరకు నిజామా బాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి భూమయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

జోరుగా కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

పెగడపల్లి, మే 1: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా గడ్డం వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని పెగడపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు బుదవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని దీకొండ మైసమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో నాలుగింటిని వంద రోజులలోపే అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదంటూ, గడ్డం వంశీకృష్ణను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఆస్కారం ఉంటుందంటూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బుర్ర రాములు గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, నాయకులు చాట్ల విజయభాస్కర్, సతీష్ రెడ్డి, రాజు, సంధి మల్లారెడ్డి, కడారి తిరుపతి, చెట్ల కిషన్, బుర్ర తిరుపతి గౌడ్, వంశీధర్ రావు పాల్గొన్నారు.

కేంద్రం నిధులను గాడిద గుడ్డుతో పోల్చడం సరికాదు

బీజేపీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, మే 1: కేంద్రం నిధులతో రాష్ట్రంలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టి వాటిని గాడిద గుడ్డుతో పోల్చడం సీఎం రేవంత్‌రెడ్డికి సరికాదని, అది ఆయన హోదాను దిగజార్చుకోవడమేనని బీజేపీ కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు మారు జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నేర్చకుండా కేంద్రం నిధులను గాడిద గుడ్డుతో విమర్శించే తీరు మార్చుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, మురికికాలువల నిర్మాణాలు చేపట్టలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని ప్రజలకు ఎన్నుకుంటే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సరికాదని, చిత్తశుద్ధి ఉంటే అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ప్రపంచ దేశాలకు అదిగురువుగా కొలిచే ప్రధానమంత్రిని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజలే లోక్ సభ ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు.

ఎంపీటీసీలకు కనీసం గౌరవం ఇవ్వాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి వినతి
- జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గుండెల నగేష్

మెట్‌పల్లి రూరల్, మే 1: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలచేత ఎన్నుకున్న ఎంపీటీసీలకు అధికారులు, ప్రజాప్రతినిధులు కనీస గౌరవం ఇవ్వడం లేదని జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గుండెల నగేష్ అవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని చౌలమద్ది గ్రామ శివారులో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన జనజాతర సభ స్టేజీ పైకి పార్టీ సంబంధించిన ఎంపీటీసీలను పిలవకుండా అవమానించారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ చెందిన ఎంపీటీసీలను సభ స్టేజీపైకి పిలవకుండా అవమానించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌పై ఏఐసీసీ ఇన్‌చార్జీ మల్లికార్జున ఖార్గే సీఎం రేవంత్‌రెడ్డి, నిజామాబాద్ ఇన్‌చార్జీ సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లకు ఎంపీటీసీల ఫోరం తరుపున ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీలను చిన్నచూపు చూడకుండా తీరు మార్చుకోవాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మెట్‌పల్లిలోని గోల్డెన్ బేకరీ సీజ్
- ఫుడ్ సేఫ్టీ శాఖ జిల్లా అధికారి అనూష

మెట్‌పల్లి, మే 1: తినే పదార్థాల నాణ్యత ప్రమాణాలను నిర్వహకులు తప్పకుండా పాటించాలని ఫుడ్ సేఫ్టీ శాఖ జిల్లా అధికారి అనూష సూచించారు. పట్టణంలో నాణ్యత పాటించకుండా బేకరీలు, ఐస్ క్రీమ్ దుకాణాలు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు బుధవారం తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని గోల్డెన్ బేకరీలో కాలం చెల్లిన చిప్స్, బ్రెడ్ ప్యాకెట్స్‌తో పాటు పలు రకాల పదార్థాలను గుర్తించారు. కాలం చెల్లిన వాటిని ఏలా విక్రయిస్తారని నిర్వాహకులను ప్రశ్నించి బేకరీని సీజ్ చేసి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరలు పెరగడంతో కల్తీ ఉత్పత్తులు విక్రహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట పోలీసు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

'సామాజిక నేరాలపై అప్రమతంగా ఉండాలి'

మెట్‌పల్లి, మే 1: నేటి ఆధునిక సమాజంలో జరుగుతున్న కొత్తరకమైన నేరాలపై ప్రజలు అప్రమతంగా ఉండాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి కంచె ప్రసాద్ అన్నారు. బుధవారం మెట్‌పల్లి కోర్టు కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత తరుణంలో సైబర్, టెక్నాలజీ నేరాల్లో మోసానికి గురై నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్మికులకు ప్రస్తుతం అనేక చట్టాలతో పాటు కోర్టులు, న్యాయాధికారులు కూడా అండగా ఉంటున్నారన్నారు. లీగల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీపీ మురళి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ప్రధానకార్యదర్శి తునికి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు ఎల్కుల రాంబాబు, రాంపల్లి జగన్, మగ్గిడి వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ధర్మపురి, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ధర్మపురి ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, ఏఎంసీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్ కోరారు. మండలంలోని కొసునూర్‌పల్లె, జైనా గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి బుధవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలింపించా లని కోరారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షులు సౌళ్ల భీమయ్య, మాజీ సర్పంచులు ఎన్నం లక్ష్మారెడ్డి, కుడిక్యాల మహేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు మొగిలి శేఖర్, గాండ్ల రవి, గాజుల సత్తయ్య, గడ్డం బాలరాజు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

'కొప్పులను ఎంపీగా గెలిపించాలి'

వెల్గటూర్, మే 1: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన అభివృద్ధిని చూసి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కొప్పుల ఈశ్వర్ సతీమణి కొప్పుల స్నేహలత అభ్యర్థించారు. బుధవారం మండలం లోని రాజక్కపల్లి, శాఖాపూర్, కప్పారావుపేట, ముక్కట్రావ్‌పేట గ్రామాలలో స్థానిక నాయ కులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరంతరం ప్రజల్లో ఉండి ఆపదలో ఉన్న వారిని ఆదుకునే మంచి గుణం ఉన్న కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాం చంద్రంగౌడ్, ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేష్, జూపాక కుమార్, కొప్పుల సురేష్, సత్యం, సనీల్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా మురళి

మల్లాపూర్, మే, 1 : మల్లాపూర్ మండలంలోని గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శుల మండలాధ్యక్షుడుగా గోరుమంతుల మురళిని ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. అధ్యక్షుడుగా గోరుమంతలు మురళి, ఉపాధ్యక్షుడుగా సరుగుల రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఈర రంజిత్ కుమార్, కోశాధికారిగా నోముల నారాయణరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. కార్యవర్గాన్ని సన్మానించి అభినందనాలు తెలిపారు.

జడ్పీచైర్‌పర్సన్ ప్రచారం

జగిత్యాలరూరల్, మే 1 : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డికి మద్దతుగా జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్, సంఘంపల్లి, కల్లెడ గ్రామాలలో జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈకార్యక్రమంలో గ్రామ, మండల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్, మే 1 : ఎండల తీవ్రత తీవ్రంగా ఉన్న దృష్ట్యా ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల రూరల్ ఎంపీడీవో రమాదేవి అన్నారు. జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీ, అంతర్గాం గ్రామాల్లో ఉపాధిహామీ పనిప్రదేశాలను బుధవారం సందర్శించారు. అనంతరం పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్‌లు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మల్లారెడ్డి

రాయికల్, మే 1: కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పట్టణానికి చెందిన కుర్మ మల్లారెడ్డి బుధవారం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కొండపెల్లి శ్రీధర్ రెడ్డి నియామక పత్రం పంపగా జిల్లా అధ్యక్షుడు పైడిపెల్లి సత్యనారాయణ రావు అందజేశారు. ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, ప్రధాన కార్యదర్శి బొడుగం శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా మే డే



వేడుకల్లో పాల్గొన్న సీఐటీయూ, బీసీ సంఘం నాయకుల

జగిత్యాల టౌన్, మే 1 : జిల్లా కేంద్రంలో బుధవారం మే డే సందర్భంగా ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని గోవింద్‌పల్లి చైరస్తా, బీట్ బజార్, కొత్త బస్టాండ్, ఎల్ఐసీ కార్యాలయం, తదితర ప్రాంతాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్ సులోచన, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గర్వందుల రమేష్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మునిపట్ల లక్ష్మి నారాయణ తదితరులు మాట్లాడుతూ కార్మికుల కష్టం బంగారం కన్నా విలువైందన్నారు. కార్మిక చట్టాలను అమలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, గంగాధర్, రాంచందర్, చంద్రశేఖర్, వెంకటాచారి, మహమ్మద్, చంద్రయ్య, దేవయ్య, సుజాత ఉన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో మే డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు బత్తిని రాజయ్య, వాటర్ ట్యాంక్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం ధర్మపురి పట్టణ అధ్యక్షులు బడుగు లచ్చయ్య, మండల పంచాయితీ కార్మికుల సంఘం అధ్యక్షురాలు నల్ల సునీత జెండాను ఎగుర వేశారు. స్థానిక ఏఎంసీ కార్యాలయం ఆధ్వర్యంలో ఏఐటీయుసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు దుగ్గిళ్ల తిరుపతి, జైనా గ్రామంలో సుతారి, కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు కుంటాల శంకర్, ఎలక్ట్రికల్ సంఘం అధ్యక్షులు గుండా మహేష్ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం సంఘటిత పోరాటం చేద్దామని పిలుపు నిచ్చారు. ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు లేబర్ కార్డులు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ కార్మిక సంఘం, ఏఐటీయుసీ, సీఐటీయు నేతలు ఉడుత తిరుపతి, బత్తిని భూమయ్య, ముడుసుల సత్యం, లక్ష్మణ్, మొరుగంటి దినేష్, ముడుసుల శేఖర్, మసీదు గంగాధర్, పులి లక్ష్మణ్, ముప్పట్ల రాజనర్సు, కన్నెపల్లి రాజన్న, ముప్పట్ల లక్ష్మణ్, బడుగు రాములు, లక్ష్మణ్, మోకినపెల్లి రాజయ్య, చంద్రయ్య, గంగమ్మ, సత్యమ్మ, గంగారాం, మున్సిపల్, పంచాయతీ కార్మికులు, హమాలీలు 30 మంది సభ్యులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని అంగడి బజారులో తాపీ కార్మికులు, బస్టాండ్ ప్రాంతంలో బుధవారం సీఐటీయు నాయకులు ఆటో కార్మికులు మే డే వేడుకలను కార్మిక జెండాను ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు కోమటి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు గుడిసె దేవయ్య, పంచాయతీ కార్మికులు, తాపీ కార్మిక సంఘం నాయకుడు రవి, వివిధ పార్టీల నాయకులు నారాయణగౌడ్, మల్లిఖార్జున్‌రెడ్డి, వెంటేష్‌గౌడ్, రఘు, శ్రీనివాస్, రాజేశం, స్వామి, లక్ష్మారెడ్డి, రాజు, గంగయ్య, మల్లేశం, పారిశుధ్య కార్మికులు రమేష్, మొహన్, నరేష్, ఆటో యూనియన్ నాయకులు ప్రభుదాస్, మల్లేశం పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో బుదవారం కార్మిక దినోత్స వ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలితో పాటు ఎల్లాపూర్, రాజారాంపల్లి తదితర గ్రామాలలో ఏఐటీయుసి ఆధ్వర్యంలో జండా ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, జిల్లా మండల నాయకులు శనిగరపు ప్రవీణ్, రాచర్ల సురేష్, రమేష్, రాము, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, బొమ్మెన స్వామి, పలుమారు మల్లేశం, బొమ్మెన శంకర్, హన్మంతు, బాబు, స్వామి, ఎర్రయ్య పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పని చేస్తున్న హమాలీలు బుధవారం మే డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ అండర్ వర్కర్స్ అసోసియేషన్, సీఐ టీయూ, ట్రాలీ ఆటో యూనియన్, ప్యాసింజర్ ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో మే డే వేడుకలు నిర్వహించి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో హమాలీ సంఘం అధ్యక్షుడు మారం మల్లయ్య, హమాలీలు సాంబయ్య, మోహన్ రెడ్డి, చందు, బుచ్చయ్య, సీఐటీయూ మండల అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య, సురేష్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని సీఐటీయూ, కార్మికుల ఘనంగా నిర్వహించారు. బుధవారం మేడే సందర్భంగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో అమాలి కార్మిక సంఘం అధ్యక్షుడు సోమిడి రాజయ్య, మున్సిపల్ కార్యాలయం సమీపంలో కార్మిక సంఘం అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, మెట్‌పల్లి విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఎదు రుగా 1104 యూనియన్ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు శ్యామ్‌లు కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులను అధికారులు శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ మేడే ప్రాముఖ్యత గురించి తోటి కార్మికులకు తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ కార్మిక నాయకులు లక్ష్మణ్, లక్కంపల్లి సురేష్, అమాలి కార్మిక నాయకులు మల్లయ్య, సురేష్, పెదకొండ నర్సయ్య, సంపత్, సానిటర్ ఇన్స్పెక్టర్ రత్నాకర్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల/కోరుట్ల రూరల్ : ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడు కలను పట్టణం కార్మిక సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సీపీఐ, తెలంగాణ ప్రగతి శీల బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అదే విధంగా శ్రీనివాస రోడ్డులో తెలంగాణ బీడీ కమ్‌గార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. పట్టణంలో సబ్ స్టేషన్ ఆధ్వర్యంలో 1104 యూనియన్, ఆర్‌టీసీ డిపోలో ఆర్‌టీసీ కార్మికులు, మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికులు, హమాలీ సంఘ సభ్యులు వేడుకనలు నిర్వహించారు. అమరులకు నివాళ్లను అర్పించారు. కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలో మే డే బుధవారం ఘనంగా నిర్వహించారు. వెల్గటూర్‌లో కార్మికులు జండాను ఆవిష్కరించగా, పైడిపెల్లిలో సీపీఐ నాయకుడు దుడ్డెల మల్లేష్ ఆధ్వర్యంలో జండాను ఆవిష్కరించారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల సమస్యలు తీరడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, గాజుల రాజయ్య, మ్యాకల పోచయ్య, పంబాల సతీష్, లక్ష్మణ్, లింగయ్య, లచ్చయ్య, వెంకయ్య, కిష్టయ్య, పవన్, శ్రీనివాస్, రాజు, సురేష్, సత్తయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

మల్యాల: మండలంలో మేడే వేడుకలను కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. మల్యాల అంగడిబజార్ వద్ద సీఐ టీయూ, బ్లాక్ చౌరస్తా వద్ద ఏఐటీయూసీ, లంబాడిపలిల్లో ఏఐఎఫ్ టీయూ ఆధ్వర్యంలో మేడే జరిపి జెండాలను ఎగురవేశారు. పారు. ఈ కార్యక్రమంలో కోరెపు మల్లేశం, కొక్కుల శాంత, రజని, శోభరాణి, కట్కూరి కరుణాకర్, లక్ష్మక్కతో పాటు ఒజ్జల లక్ష్మన్, రఘుబాబు, దశరథం, ఇమామ్, లాల్‌మహ్మద్, అనిల్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి ఏఎంసీలో..



ధర్మపురిలో తెలంగాణ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో..



కోరుట్లలో మేడే వేడుకలో నిర్వహిస్తున్న కార్మిక సంఘ నేతలు

జన జాతర సభకు భారీ బందోబస్తు



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న జువ్వాడి సోదరులు, నాయకులు

కోరుట్ల రూరల్, మే 1: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కోరుట్లలో నిర్వహించిన జన జాతర సభకు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ నేతృత్వంలో మెట్‌పల్లి, జగిత్యాల డీఎస్పీలు మెట్‌పల్లి, కోరుట్ల పోలీసు సర్కిల్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలతో పాటు సుమారు 200 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ట్రాఫిక్ ఆంక్షలతో వాహనాల దారి మళ్లింపు..

సీఎం సభ సందర్భంగా వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్తలను తీసుకున్నారు. ట్రాఫిక్ ఆంక్షలతో వాహనాలను దారి మళ్లించారు. సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసే వరకు కోరుట్ల నుంచి మెట్‌పల్లి వైపు, మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వెళ్లే భారీ వాహనాలకు బైపాస్ రహదారి గుండా పంపారు. మెట్‌పల్లి నుంచి వెళ్లే వాహనాలను పట్టణంలోని బస్ డిపో క్రాస్ రోడ్డు నుంచి వేంపేట, ధర్మారం మీదుగా అయిలాపూర్, కోరుట్ల పట్టణానికి పంపారు. ఇదే దారిలో కోరుట్ల నుంచి మెట్‌పల్లి వైపు వెళ్లే వాహనాలను పంపి జాతీయ రహదారిపై ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

భారీగా జన సమీకరణ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుట్లలో బుధవారం నిర్వహించిన జన జాతర సభకు భారీగా జనం తరలివచ్చారు. నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావుల నేతృత్వంలో జన సమీకరణ జరిగింది. కోరుట్ల నియోజకవర్గంతో పాటు సమీపంలోని వేములవాడ, జగిత్యాల, ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ అర్బన్, బోదన్ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు సభకు హాజరయ్యారు. ప్రత్యేక వాహనాలల్లో జనాన్ని సభ ప్రాంగాణానికి తరలించారు. వేల సంఖ్యలో హాజరైన జనానికి అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్వాహకులు కల్పించారు.

- సీఎం సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం కోరుట్ల శివారులో జరిగిన జన జాతర ఎన్నికల ప్రచార సభకు హాజరుకావడానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.
- పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం కోరుట్లకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం లభించింది. పట్టణ శివారులోని మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద నిజామాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగ్ రావు సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.
- సీఎం రేవంత్ రెడ్డికి జువ్వాడి బ్రదర్స్ చిత్రపటం బహుకరించారు. పట్టణం శివారులోని జరిగిన ప్రజా ఆశ్వీరాద సభలో సీఎంకు నిజామాబాదు కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, జువ్వాడి కృష్ణారావులతో పాటు నాయకులు చిత్ర పటాన్ని అందిం చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ శీలం వేణుగోపాల్, కౌన్సిలర్ అడెపు కమల - మధు, కాంగ్రెస్ నాయకులు కొంతం రాజం, తిరుమల గంగాధర్, పెరుమాండ్ సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, జెట్టి లింగం పాల్గొన్నారు.

నియామకం

కోరుట్ల, మే 1 : కోరుట్ల నియోజకవర్గ చేనేత పద్మ సమైక్య ప్రధాన కార్య దర్శిగా కంటం ఉదయ్ కుమార్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధికార ప్రతినిది రాంపెల్లి బాలరాజ్ నియామక పత్రం అందించినట్లు చైనేత సంఘ సభ్యులు బుధవారం తెలిపారు. సహకరించిన చేనేత పద్మ సమైక్య రాష్ట్ర అధ్యక్షడు కొండ రామ మోహన్, ప్రదాన కార్యధర్శి సుదర్శన్ నేత, రాష్ట్ర అధికార ప్రతినిధి బాలరాజ్‌లకు ఉదయ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ నాయకుల ప్రచారం

జగిత్యాలరూరల్, మే 1 : బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ధర్మపురి అర్వింద్‌ను గెలిపించాలని కోరుతూ జగిత్యాల అర్బన్ మండలం ధరూర్, అంబారిపేట, హస్నాబాద్, రూరల్ మండలం తిమ్మాపూర్ గ్రామాల్లో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భోగ శ్రావణి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మ్యాదరి అశోక్, నాయకులు తరాల మహేష్, గంగారాం, శేఖర్, గంగన్న, నవీన్, రఘు, భూమేష్, రవి, అరవింద్, పాల్గొన్నారు.

హామీల అమలులో రేవంత్ సర్కారు విఫలం

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లిలో ప్రచారం చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, మే, 1 : కాంగ్రెస్ పార్టీ మా మాటలతో అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా ఇచ్చిన ఆరుగ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్ గెలుపు కోసం బుధవారం పట్టణంలో తనయుడు బాజిరెడ్డి జగన్ ప్రచార కార్యక్రమం చేపట్టగా ఆయనతో కలిసి ఎమ్మెల్యే ప్రచారం చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి, నాలుగు నెలల రేవంత్‌రెడ్డి పాలనలో ఏ విధంగా ప్రజలు గమనించాలన్నారు. ఇచ్చిన హామీలను నేరవెర్చకుండా ఎప్పుడు కేసీఆర్‌ను ఇష్టం వచ్చినట్లు తిట్టుతూ ప్రజలను ఆయోమయానికి గురి చేస్తున్నరని విమర్శించారు. మోసపూరితమైన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు లోక్‌సభలో ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ ఓజ్జెల బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువనేత శ్రీనివాస్, ప్రవీణ్, తేజ, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రచారం కార్యక్రమం చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్ భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, పాక నర్సయ్య, జుంగుల మారుతి, పాల్గొన్నారు.

కోరుట్ల: కారు గుర్తుపై ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో నిజామాబాదు ఎంపిగా గెలిపించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కొరారు. బుధవారం పట్టణంలోని వార సంతలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, కౌన్సిలర్ గడం గంగాధర్‌లతో కలిసి ఎన్నికల ప్రచారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ చేశారు.

మల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజీరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పిలుపునిచ్చారు. బుధ వారం మండలంలోని రేగుంట, సాతారం గ్రామాల్లో ప్రచారం చేపట్టినంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పదేండ్ల కేసీఆర్ పాలన, నాలుగు నెలల కాంగ్రెస్ పాలన గమనించాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మ ద్ధతుగు ఉండి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డీలర్ మల్ల య్య, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మల్యాల: కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ అభి వృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థి వి.రాజేందర్‌రావును ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రజలను కోరారు. మండలంలోని నూకపల్లి, రామన్నపేట, మద్దుట్ల, గొర్రెగుండం, ఓబులాపూర్, రాంపూర్, గొల్లపల్లి, పోతారం, రాజారం గ్రామాల్లో రాజేంధర్‌రావుకు మద్దతుగా ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కథలాపూర్: మండలంలోని పోసానిపేట ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం బడిబాట కార్యక్రమం వినూత్న రీతిలో నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పించే వసతులపై నాటకాల రూపంలో రూపొందించిన కథలను డీజేతో పలు వీధుల వెంట వినిపించారు. బడిబాటలో 32 మంది విద్యార్థులకు కొత్తగా అడ్మిషన్ కల్పించామని గుండేటి రవికుమార్ తెలిపారు.

●మండలంలోని అంబారిపేటలో బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీగా ఉన్న సమయంలో వినోద్‌కుమార్ ఎంతో అభివృద్ధి చేశారని వివరించారు.

●గడిచిన పదేళ్ల కాలంలో ప్రధాని నరేంద్రమోదీ పాలనాతీరును గమనించిన ప్రజలు మూడోసారి బీజేపీకే పట్టం కట్టబోతున్నారని నియోజకవర్గ బీజేపీ కోఆర్డినేటర్ బుక్క వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం బండి సంజయ్‌కుమార్‌కు మద్దతుగా తాండ్ర్యాల, కథలాపూర్, పోసానిపేట గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన అనంతరం మాట్లాడారు.

మెట్‌పల్లి రూరల్ : ప్రధానమంత్రి నరేంద్రమోడికి మూడోసారి గెలిపించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి ప్రజలను కోరారు. బుధవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామ శివారులో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు కరపత్రాలను అందజేసి ప్ర చారం చేపట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీ అభ్యర్థి ఎంపీ ధర్మపురి అరవింద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ గ్రామ పంచాయతీ కార్మికుడు పూడురి రవి(35) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. రవి గ్రామ పంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రవికి భార్య అనురాధ, వేదాంత్ (6) నిక్షిత్ (4) ఉన్నారు.

కొడిమ్యాల : కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొడిమ్యాలలో ఉపాధిహామీ కూలీల వద్ద ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును పార్లమెంటుకు పంపాలని కోరారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను అందించారు.

●ప్రజలంతా కలిసి బీజేపీకి మద్దతు ప్రకటించి నరేంద్రమోడీని మరోసారి ప్రధాన మంత్రిని చేయాలని దక్షణ భారత స్వావాలంబీ సభ్యురాలు, కర్ణాటక రాష్ట్ర సభ్యురాలు చొప్పదండి ఇన్‌చార్జ్ లత కోరారు. బుధవారం ఆమె ఎన్నికల ప్రచారంలో భాగంగా కొడిమ్యాల మండలంలో పర్యటించి పలువురు ఓటర్లను కలిసి కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను గెలిపించాలని తద్వారా నరేంద్రమోడి ప్రధాన మంత్రి అవుతారన్నారు.

●మండలంలోని తిర్మాలాపూర్ గ్రామ శివారులో మంగళవారం రాత్రి తిర్మాలాపూర్ గ్రామానికి చెందిన నందరవేని లక్ష్మన్‌కు చెందిన లేగ దూడపై అడవి మృగం దాడి చేయటంతో మృతి చెందింది. దాడి చేసింది రేసు కుక్కలా, తోడేళ్లా లేదా ఇతర ఏదైనా అడవి మృగమా అని అటవీ అధికారులు పరిశీలిస్తున్న డీఆర్వో ఆర్. మోనిక తెలిపారు.

●మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా బుధవారం భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి పంచా మృత అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఉదయం నుండి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి నాగరాజు రమేష్, హన్మాన్ దీక్షాపరులు, దాతలు, గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.